

అరుంధతి దవాఖానను సందర్శించి అక్కడి సదుపాయాలగురించి పేషంట్లను అడిగి తెలుసుకుంటున్న భారత్ స్టార్ షూటర్ ఇషాసింగ్

## మనసున్న మారాజు మర్రి

- భారత్ షూటర్ ఇషాసింగ్

నేరేడ్‌మెట్, నవంబర్ 11: మర్రి అరుంధతి సూపర్ స్పెషాలిటీ దవాఖాన స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న మల్కాజిగిరి అసెంబ్లీ నియోజవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి యువతకు స్ఫూర్తి ప్రదాత అని భారత స్టార్ షూటర్ ఇషాసింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుండిగల్‌లోని అరుంధతి దవాఖాన సందర్శించిన ఇషాసింగ్ అక్కడ వైద్యం తీసుకుంటున్న పేషంట్లతో కొంచెం సేపు ముచ్చటించారు. డాక్టర్లు ఇస్తున్న ట్రీట్‌మెంట్ ఎలా ఉందని? సదుపాయాలు ఎలా ఉన్నాయి? అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా మంచి వైద్యం సేవలందించడంతో పాటు గుండె సర్జరీలు మొదలు అన్ని ఆపరేషన్లు పైసా ఖర్చులేకుండా, డబ్బులు తీసుకోకుండా చేస్తుండటం పట్ల ఇషాసింగ్ హర్షం వ్యక్తం చేశారు. అమ్మకు ఇచ్చిన మాట మేరకు ఇంత పెద్ద హాస్పటల్ నిర్మించి, పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి గొప్ప మనసున్న మారాజు అని కొనియాడారు. కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్ రెడ్డి, వైద్యులు హర్షవర్ధన్ రెడ్డి, ఇతర దవాఖాన సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి గుర్రం రాజ్యలక్ష్మి

## కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్

- బీఆర్‌ఎస్‌లో చేరిన జిల్లా కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి గుర్రం రాజ్యలక్ష్మి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 11: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం రాజ్యలక్ష్మి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో గుర్రం రాజ్యలక్ష్మి శనివారం బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ నేతలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన నాయకురాళ్లు బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు.

## ఏపీ నుంచి మొదటి భారత్ గౌరవ్ రైలు

- ఈ నెల 18 నుంచి ప్రారంభం..
- ఏపీతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర స్టేషన్ల మీదుగా..

సిటీబ్యూరో, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): భారత గౌరవ్ రైలు యాత్రను తొలిసారిగా ఏపీ నుంచి ప్రారంభించాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 18న ఏపీ నుంచి ఈ యాత్ర రైలు ప్రారంభించడానికి రైల్వే అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడిపిస్తున్న భారత గౌరవ్ రైళ్లలో వంద శాతం ఆక్యుపెన్సీతో ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో ప్రారంభమయ్యే ఈ యాత్రకు సంబంధించిన రైలు ఏపీతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర మీదుగా ఆయా రాష్ట్రాలలో ఉన్న పలు రైల్వే స్టేషన్లలో యాత్రికులు ఎక్కి, దిగే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# పోలింగ్ సజావుగా సాగేలా..

- నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బంది సెకండ్ రాండమైజేషన్
- ఓటర్ల నమోదు శాతం పెంచేందుకు సెలబ్రిటీలతో ప్రచారం
- అధికారుల సమావేశంలో రొనాల్డ్ రాస్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సిటీబ్యూరో/మేడ్చల్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సూచించారు. నామినేషన్ల పర్వం పూర్తయిన నేపథ్యంలో శనివారం ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఈవో అనుదీప్ దురిశెట్టి, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీశ్, శంకరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది కోసం వాహనాల అవసరం సెక్టోల్ వారీగా గుర్తించి సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్‌లో విధులు నిర్వహించే వారు ఎక్కడి నుంచి వస్తున్నారో తెలుసుకొని ట్రాన్స్‌పోర్ట్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్, కమ్యూనికేషన్ ప్లాన్, పోస్టల్ బ్యాలెట్, వాహనాలు, ట్రాన్స్ పోర్ట్ ప్లాన్, సిద్ధం చేసుకోవాలని రోనాల్డ్ రోస్ సూచించారు.

### సెకండ్ రాండమైజేషన్‌కు ఏర్పాట్లు..

నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బంది సెకండ్ రాండమైజేషన్‌కు ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ చెప్పారు. ఆబ్సెంట్, షిఫ్ట్, డూప్లికేట్ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని తెలిపారు. ఈ విషయంలో ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు విస్తృత అవగాహన, ప్రచారానికి చర్యలు చేపట్టాలన్నారు. అంధులకు ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో బ్యాలెట్‌ను తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని రోనాల్డ్ రోస్ తెలిపారు. 80 ఏండ్ల పైబడిన వృద్ధులకు దివ్యాంగ ఓటర్లకు ఇంటి వద్దే ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు, హోమ్ ఓటింగ్ సెక్టోరల్ వారీగా ఎంత మంది ఉన్నారో సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ కోసం వాహనాలను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధిక ఓటర్ల నమోదు శాతం పెంచేందుకు సెలబ్రిటీల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించాలని చెప్పారు. పోలింగ్ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేయాలని, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషియన్ సెంటర్లను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రోనాల్డ్‌రోస్ తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లకు, కౌంటింగ్ సిబ్బంది రెండో దశ శిక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ఎంసీసీ ఉల్లంఘునపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రోరల్ ప్రింటింగ్, బీఎల్‌ఓ రిజిస్టర్, ఎపిక్ కార్డ్ పంపిణీ వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం-6, 8 క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని ఎన్నికల అధికారి సూచించారు.

## పారదర్శక నిర్వహణకు కృషి

**మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**

జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల పర్యవేక్షణ నిధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీసు జనరల్ అబ్జర్వర్లు, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోలీకేరి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 28 లక్షల 19 వేల 67 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 438 లోకేషన్స్‌లో పోలింగ్ స్టేషన్లు 2397 ఉండగా, వీటిలో అర్బన్ పోలింగ్ స్టేషన్లు 2239 రూరల్ పోలీస్‌స్టేషన్లు 158 ఉన్నాయన్నారు.

### నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు..

నూతన ఓటర్‌గా నమోదు చేసుకున్న ఓటర్లకు గుర్తింపు కార్డులను పోస్ట్ ద్వారా లేదా బీఎల్‌వోల ద్వారా ఓటర్ చేర్చడం జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ఐదు నియోజకవర్గాలలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలకు ఈవీఎం, వీవీపాట్, సీయూలను అందించడం జరిగిందన్నారు. జిల్లాలో వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల నియమావళికి ఉల్లంఘునకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడీఓసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 1950 టోల్ ఫ్రీ ద్వారా కూడ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

### ప్రలోభాలపై ప్రత్యేక నిఘా..

ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో 14 చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు రాకుండా కట్టడి చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలు మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉన్నదని, ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని పరిశీలకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హోళీ మేరి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మైనార్టీ డిక్లరేషన్.. అతి పెద్ద జోక్

- తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్
- కాంగ్రెస్ బూటకపు, తప్పుడు వాగ్దానాలకు తెలంగాణ ప్రజలు లొంగరు
- బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయంతో హ్యాట్రిక్ సాధించడం ఖాయం

సుల్తాన్ బజార్, నవంబర్ 11: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించడం అతి పెద్ద జోక్‌గా తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్ అభివర్ణించారు. ఈ మేరకు శనివారం గన్‌ఫౌండ్రీలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల ప్రాతిపదికన జనగణన చేపట్టడం, వాటి ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తే రాష్ట్రంలో వర్గ విద్వేషాలు, పోరాటాలు జరిగే ప్రమాదముందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కాదది, కాంగ్-ఆర్‌ఎస్‌ఎస్ అని ఆయన ధ్వజమెత్తారు. హిందూ, ముస్లింలు అన్నాదమ్ముల్లా కలిసి ఉన్న వారిని బాబ్రీ మజీదు అంశంతో గొడవలకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం, గత తొమ్మిదేండ్లు ఎలాంటి మత విద్వేషాలు లేకుండా ప్రశాంతంగా కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తిరిగి మత కలహాలతో హైదరాబాద్ ప్రజలు నరకాన్ని చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నిన్న మొన్నటి వరకు సీఎం కేసీఆర్‌తో ఉంటూ సమాజంలో పలుకుబడి పెంచుకున్న కొందరు వ్యక్తులు ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీపై, కేసీఆర్‌పై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అడగక ముందే సబ్బండ వర్గాల అభ్యున్నతికి పాటు పడిన ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లింల అభ్యున్నతి కోసం 204 మైనార్టీ స్కూల్‌ను ప్రారంభించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ధోకా బాజీ చేసే కాంగ్రెస్ పార్టీ హయాంలోకి వస్తే టెమ్రీస్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మూతపడే అవకాశం ఉందన్నారు. 50 ఏళ్ళ పరిపాలనలో ఏనాడు ముస్లింల అభ్యున్నతి, సంక్షేమం కోసం పాటు పడని కాంగ్రెస్ పార్టీ నేడు కల్లిబొల్లి మాటలను ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలు నమ్మొద్దని అన్నారు. తప్పుడు వాగ్దానాలు, బూటకపు హామీలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి సీఎం ఎవరనేది చెప్పడంతో పాటు మత కలహాలు జరుగవని స్పష్టమైన హామీని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అత్యధికంగా మత కలహాలు జరిగాయని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికలలో బీఆర్‌ఎస్ అత్యంత ఘన విజయంతో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్ ఇషాక్